# అ'స్త్రీ'లత

నేల రంగు వీధులమీద రంగు రంగుల 'స్మితా' కోకచిలుకలు వయ్యారంగా నడుస్తున్నాయి.

కాళ్ళకు షికార్లను అతికించుకున్న కుర్తా, పైజమాలు, బాగీ ఫేంట్స్, మాక్సీ షర్ట్స్, గులాబీ రెక్కల్ని పెదవుల మీద అద్దుకుని విశాలపు వీధుల మీద పూల రేకులు దొర్లుతున్నట్టుగా పరుగెడుతున్నాయి. ట్రాఫిక్ ఐలాండ్‌కి అయిదు పదుల అడుగుల ముందు, ఎడమ పక్క పచ్చని గోడమీద, వెచ్చని బహిరంగ సెక్సాహ్వానం.

నడిరోడ్డున ఎడమపక్కన అందరికీ కన్పిస్తూ, అంతెత్తున విశాలమైన బోర్డింగ్ మీద, ఆవలిస్తూ, కవ్వింతల కాటుక ధూపం, వెనక నగిషీల కర్పూర శిల్పంలా కూర్చున్న ఆడపిల్ల మెడలోనిగొలుసు, తత్తరపాటుగా అటూ, ఇటూ ఢీకొన్న పాల వెన్నెల చప్పుడు...

నగరపు దట్టమైన రద్దీలో, ఆమె కుడిచేయి అయిదువేళ్ళూ అతని నడుమ్మీద పడినపుడు, ఉచ్ఛ్వాశిస్తున్న నయాగరా జలపాతం...

ట్రాఫిక్...ట్రాఫిక్.. రద్దీ... రద్దీ...

గాల్లో కలుస్తున్న వాహనాల పొగల్లో వేడి వేడి, వాడి వాడి జోడీల సెగలు.

సిటీ ముసలి పోలీస్ కమీషనర్, వర్షంలో మువ్వన్నెల జండాలా ఉండుండి ఎగురుతున్నాడు.

ఆయన ముఖంలో ఫీలింగ్స్ బట్టి, డి.సి.పీ.లు హావభావాల్ని ఊసరవెల్లుల్లా మారుస్తున్నారు.

రోడ్లమీద, వీధుల నిండా, సందుల్లోనూ, ఆఖరికి సెక్రటేరియట్ గోడమీదా సెక్స్... సెక్స్.... సెక్స్! సి.ఎమ్. గారు ఇంటినుంచి బయల్దేరి, ఆఫీసుకు చేరే

దారిలో ఎక్కడో రోడ్డు పక్క గోడమీద, ఏదో పిక్చర్ వాల్ పోస్టర్ బ్లూఫిలిమ్ పోస్టర్లా ఉందట... దాన్ని చూసుకుంటూ, ఆ డ్రైవర్ గాడు బ్రేక్ వెయ్యడం మరిచిపోయాట్ట... స్పీడ్ బ్రేకర్ని గుద్దేశాడట.. పర్యవసానం సి.ఎమ్. గారి నుదురు ముందు సీటుకి తగిలి... ముక్కు పైభాగంలో గాయమైందట... ఆ గాయం తగలడానికి కారణం సెక్స్ వాల్ పోస్టర్లు. ఎక్స్ప్లనేషన్ ఏమిటి? అంటూ నా కొచ్చిన లెటర్ ఇది..." అని ఎడం చేతివైపు వున్న ట్రేలో ఓ బూడిదరంగు కాగితాన్ని తీసి చూపిస్తూ, అగ్గిరాముడి టైపులో భగ్గుమన్నారు కమీషనర్.

"గోడమీద బూతులకీ, గోడచాటు ముద్దులకీ అంత ఇదైపోతే ఎలాసార్.." నెమ్మదిగా గొణిగాడు ఓ ఏ.సి.పి.

"ఇది లెటరా... సంజాయిషీ ఇవ్వమని మెమోనా.... సి.ఎమ్. ఎంత తెలంగాణా వాడైతే మాత్రం, శుద్ధ తెలంగాణా మాండలికంలో ఆఫీసు లెటర్స్ పంపి, సదరు తెలంగాణా మాండలికంలోనే రిప్లయ్ ఇవ్వాలంటూ పట్టుపడితే ఎలా.. ఈ లెటర్స్ చూడండి.. విశాఖ, శ్రీకాకుళం నుంచీ, అనంతపురం, కడపల్నించీ వచ్చిన కంప్లయింట్ లెటర్స్ చూడండి... విశాఖ మాండలికంలోనే రిప్లయ్ ఇవ్వాలట...రాయలసీమ మాండలికంలోనే రిప్లయ్ ఇవ్వాలట...నేనిక్కడున్నది మాండలికాలు నేర్చుకుని జావాబులివ్వడానికా... శాంతి భద్రతల్ని కాపాడ్డానికా..." అంతెత్తున్న ఎగిరి, గ్లాసులోని నీళ్ళను గడ గడ తాగి, కుర్చీలో కూలబడ్డాడాయన.

అంతవరకూ గడకర్రల్లా నిలబడ్డ పోలీసు ఆఫీసర్లు కూడా కుర్చీల్లో కూలబడ్డారు.

రెండు నిమిషాల తర్వాత-

"బైదిబై... అసలు పాయింటు... తారూ, కంకరా కల్సిపోయినట్టు సొసైటీలో బూతు కల్సిపోయింది... సినిమాల్లో బూతు.. పత్రికల్లో సెక్స్ ... టీ.వీ.ల్లో బూతు... ఆబూతును మనమెలా తీసెయ్యగలం చెప్పండి, మీరైనా చెప్పండి.

వీధుల్లో, గోడలమీద. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడబడితే అక్కడ సెక్స్ వాల్‌పోస్టర్లు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయట. పెరిగిపోతున్నాయని మనకు తెలీదా... సెక్స్‌కు సంబంధించిన ఎలాంటి వాల్‌పోస్టరు కూడా కన్పించకూడదట.. సిటీలో గోడలన్నీ తెల్లగా పెళ్లింటి గోడల్లా ఉండాలట...

ఏమిటీ గోలని, సెన్సారు వాళ్ళనడిగితే మేమేం చేస్తాం.. డిస్ట్రిబ్యూటర్లని అడగండంటారు. డిస్ట్రిబ్యూటర్లని అడిగితే... మేమేం చేస్తాం... ఫిలిమ్ కంపెనీలిచ్చిన వాల్‌పోస్టర్లనే మేం అతికిస్తున్నాం తప్ప, మేం ప్రింట్ చేయిస్తున్నామా అని అంటున్నారు... థియేటర్ల వాళ్ళనడిగితే, సినిమాలు సెన్సార్ చేసినా, వాల్ పోస్టర్లనూ సెన్సార్ చేసేస్తే... మరెలా బతకడం .... మా బిజినెస్సులన్నీ డవునై పోతున్నాయని వాళ్ళగోల.

చూడండి ఆఫీసర్స్... ఎవరెన్ని సాకులు చెప్పినా, మనకో రెస్పాన్సిబిలిటీ ఏర్పడింది గదా.... కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌తోనూ, కలెక్టర్‌తోనూ మాట్లాడాను... అన్ని డిపార్ట్‌మెంట్లూ సంయుక్తంగా కల్సి, జట్లు జట్లుగా జంటనగరాల్లో వీధుల్ని, గోడల్ని పువ్వుల్లా ఉంచాలి. సెక్స్ పోస్టర్లు ఎక్కడా కన్పించడానికి వీల్లేదు... అర్థమైందా... వచ్చే వారానికి నగరం నిగనిగలాడిపోవాలి.... చీఫ్ మినిస్టర్‌గారు హేపీ ఫీలవ్వాలి..."

కమీషనర్‌గారి బాధను, ఆవేదనను అర్థం చేసుకున్న పోలీసు ఆఫీసర్లు ఎంచక్కగా తలలూపారు.

"సార్, మనం గోడల మీద సెక్స్‌నే కాదు... ఇళ్ళల్లో సెక్స్‌ను కూడా ఏకంగా ఓ ఉత్తర్వు ద్వారా నిషేధించితే పీడావదుల్తుంది సార్..." ఓ ఆఫీసర్ సలహా ఇవ్వబోయి, ఆగిపోయాడు.

బయటికి వినయంగా వెళ్తున్న సదరు పోలీసు ఆఫీసర్లను ఆనందంగా తిలకించసాగారు పోలీస్ కమీషనర్‌గారు.

సెక్స్‌కు వ్యతిరేకంగా అధికారుల యుద్ధం. మొదటి దశ ప్రోగ్రామ్‌లో భాగంగా అన్ని డిపార్ట్‌మెంట్ల అధికారులూ, రాత్రిపూట గోడలమీద వాల్‌పోస్టర్లను పీకేయసాగారు. హోర్డింగులను కూల్చసాగారు.

అదే రాత్రి సమయంలో సన్నని చినుకుల వర్షంలో లోయర్ టాంక్‌బండ్ రోడ్డులో ఒకానొక ఇంట్లోకి విచ్చలవిడిగా వెళ్తూ వచ్చేస్తున్న కుర్రవాళ్ళ బృందాన్ని, నడిరోడ్డుమీద అటకాయించి "అర్ధరాత్రి శృంగారం తప్పు బాబూ," అని బోధచేసి వదిలేసారు.

"అయితే పగటిపూట శృంగారం భలే భేషు..." ఆ కుర్రాళ్ళు హస్కీగా, విస్కీ నవ్వులు నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

భాగ్‌లింగంపల్లి టీస్టాల్ దగ్గర, నాంపల్లి స్టేషన్ దగ్గర, ఆబిడ్స్ స్వప్న థియేటర్ దగ్గర మసక చీకట్లో విటుల్ని ఆకర్షిస్తున్న యువతుల్ని రెడ్‌హేండెడ్‌గా

పట్టుకుని నగరంలో 'సెక్స్ విశృంఖలతకు కారణాలు మీరే మీరే' అంటూ వాళ్ళని న్యాయమూర్తుల ముందు నిలబెట్టి జరిమానా విధింపజేసి, వాళ్ళని సగౌరవంగా పోలీసుల జీపుల్లోనే వారి వారి ఇళ్ళకు దిగబెట్టేసారు పోలీసులు.

'నగరాన్ని నీతిగా ఉంచండి : సెక్స్‌నుంచి... సెక్స్ ఆలోచనల్నించి.... సెక్స్ అవసరాల్నించి.... నగరాన్ని మీరు రక్షిస్తే మిమ్మల్ని నగరం రక్షిస్తుంది...' పోలీసు స్పీకర్లలోంచి విన్పిస్తున్న నినాదాల హోరు, నగరాన్ని ఉప్పెనలా చుట్టేసింది.

ఇక రెండో దశ ప్రోగ్రామ్ మొదలైంది.

పోలీస్ కంట్రోల్ రూమ్ ఎదుట, మూడు పోలీసు జీపులూ, ఆరు కార్పొరేషన్ వారి జీపులూ ఒంటెల్లా నిల్చున్నాయి. ఆ జీపుల్లో పోలీసులు, కార్పొరేషన్ వారి సిబ్బంది మాత్రమే కాకుండా, ఓ పది డ్రమ్ముల్లో తెల్లటి సున్నం, ఓ అయిదు డ్రమ్ముల్లో తారు, రకరకాల సైజుల్లో చీపుర్లూ ఉన్నాయి.

అశ్లీలతను రాజధాని లోగిలిలోంచి తగిలెయ్యడానికి, అరడజను మంది పోలీస్ ఇన్‌స్పెక్టర్లు నడుంకట్టారు.

అధికారగణం, రణన్నినాదాలతో రోడ్ల మీదకు బయలుదేరింది.

సెక్స్... సెక్స్... సెక్స్....

వీధులనిండా, వీధుల వీపులమీద సెక్స్... సెక్స్ వీడియో పార్లర్ల మీద, నీలంరంగు 'బ్రా'ల మీద చిక్కిన చిక్కని సెక్స్... యూనివర్సిటీ ఆకుపచ్చ లాన్లమీద నైట్‌గౌనుల వెచ్చటి సెక్స్... నల్లని పరదాల చీకటి ప్రైవేట్ నర్సింగ్‌హోముల్లో తెల్లటి దుబాయి హాయి కసాయి సెక్స్.

యాత్రిక హోటల్లో తందూరి పొయ్యిలో నుసినుసిగా మారిన సెక్స్... మాంగల్యానికి మొదటి ముడి సెక్స్ పాడే టేప్‌రికార్డర్‌లోపలనుంచి బిగుస్తున్న కంఠంలో హమేషా నిషా సెక్స్.

అందమైన సంస్కృత సమాసాల మాటున, తెరమీద నటీనటుల 'బట్ట' బయలుకాని, టాయలెట్ పేపర్ నిర్నిద్రతాండవం సెక్స్.

సుబ్రహ్మణ్యం కాఫీ విలాస్ క్లబ్బు బయట నుంచున్నప్పుడు, ఆడపిల్లల కాలేజీ కెళ్ళే అమ్మాయిల ఎత్తయిన గుండెలమీద, కందకం గుహల ఆకలి మీద సెక్స్... సెక్స్...

అరచేతిలో గోరింటాకు మెరుపులో, బొంకుల దిబ్బరోడ్డుల మీద తిరిగిన రోజుల వెనక అంతులేని కళ్యాణక్కథక్కళీ సెక్స్...

భగవద్గీత అట్టమీద, మార్లిన్‌మన్రో శృంగార పెద్ద చెరువు నీటి అల సెక్స్... ముఖేష్ అగర్వాల్, రేఖల పెళ్ళి వార్త విన్న రెండుపదుల కుర్రాడి రెండు చేతుల నిండా సెక్స్... సెక్స్...

వనస్థలిపురానికి వెళ్ళేదారిలో, రోడ్డుపక్కన విశాలమైన గోడమీద వాల్‌పోస్టరులో ఒక అందమైన విదేశీ అమ్మాయి ఉంది. ఆ సుందరి అంగాంగాలూ, ఆలూ పుత్రులున్న అరవై వసంతాల మగాడ్ని ఎక్కడో గిచ్చి, ఇంకెక్కడో గుచ్చి, రెచ్చిపోయేట్టు చేసి, పిచ్చిపిచ్చిగా తయారుచేసే పరిస్థితుల్లో అక్కడ పోలీసు జీపూ, కార్పొరేషన్ వారి టీమూ ఆగింది.

నిలువెత్తు వాలుసొగసుల వాల్ పోస్టరు నిండా తెల్లటి సున్నపు మరకలు!

అశ్లీలత నుండి ఆ ప్రాంతం ప్రజలు తాత్కాలికంగా రక్షింపబడిరి.

సికింద్రాబాద్‌లో ఆ ప్రాంతం నిండా రంగురంగుల రకరకాల వాల్ పోస్టర్లున్నాయి. ఆ పోస్టర్ల నిండా వెర్రెక్కిస్తున్న అర్ధనగ్నపు అబ్బాయిలు, ఎంచక్కగా సెక్సప్పీల్‌తో కన్పిస్తున్నారు.

అక్కడాగింది జీపు.

"వెళ్ళి ఆ పోస్టర్ల నిండా సున్నం పూయండి... తారు రాయండి..." ఆజ్ఞాపించాడు ఇన్‌స్పెక్టరు.

ఆ ఆజ్ఞ పాటించాల్సిన ఓ పోలీసు ఉద్యోగికి, అందరూ, అబ్బాయిలున్న ఆ బొమ్మ మీద ఎందుకు సున్నం పులమాలో అర్థం కాలేదు. అదే ప్రశ్న అడిగాడు.

"నీ బుర్రలో ఏవుందో అర్థంకాదు నాకు.. చూడు.. ఆ వాల్‌పోస్టరుమీద అబ్బాయిలందరూ ఏం చేస్తున్నారు..." అడిగాడా ఆఫీసరు.

"బోర్లా పడుకున్నారు సార్..." చెప్పాడు ఉద్యోగి.

"అవునా ... అబ్బాయిలు ఉత్తినే బోర్లా పడుకుంటారా... అందునా ... ఫారిన్ కుర్రాళ్ళు. వాళ్ళకింద అమ్మాయిలుండే ఉంటారు. మనకు కన్పించడం లేదంతే... మారు మాట్లాడకుండా తుడిచేయ్..."

"యూ ఆర్ కరెక్ట్ సార్..." అంటూ ఆ పోలీసు ఉద్యోగి ఆ పోస్టరు మీద సున్నంతో విజృంభించాడు. ఆ పక్కన మాయాబజారు పోస్టరు కూడా ఉంది. ఆ పోస్టరులో ఘటోత్కచుడి పాత్రధారి యస్వీరంగారావుగారి చెవిలో శ్రీకృష్ణపాత్రధారి ఎన్టీరామారావుగారు ఏదో దేవరహస్యం చెప్తున్నట్లుగా ఉంది.

'ఆ రహస్యం యేమై ఉంటుందో... బూతు రహస్యం కాదుగదా?' అని అనుకున్నవాడై దానిక్కూడా తారూ సున్నం పూసేసి చిదానందంగా నవ్వాడతను.

సెక్రటేరియట్ మీద, పసుపురంగులో తేలిన మువ్వన్నెల జండా ఎగురుతోంది. ప్రధాని రావుగారికి పీఠాధిపతులు రెడ్ కార్పెట్ ఇన్విటేషన్. ఇటాలియన్స్‌కి బంధుప్రీతి ఎక్కువట. అందుకేనేమో సోనియా కజిన్ భాతృప్రేమకు, భారతదేశం అన్ని కోట్లు చెల్లించాల్సి వచ్చింది.

న్యూయార్క్‌లోని 'లైవ్‌షో' థియేటర్ల మీద స్టార్ టీ.వి.లో వండ్రపుల్ డాక్యుమెంటరీ, "మన టీ.వీల్లో కూడా అలాంటి లైవ్‌షోలివ్వాలి. టీ.వీ. భారతంలో ధృతరాష్ట్రుడు దేవీలాల్, అంతరింగిక హర్యానా ప్రసారంలో మేకప్‌లేని కొడుకు దుర్యోధనుడు చౌతాలాకి హితబోధ.

పాములు పుట్టల్లోనూ, చంద్రస్వాములు పొలిటీషియన్ల డైరీ పుటల్లోనూ ఉంటారు. అందుకేనేమో మేనకాగాంధీ 'మనుషుల్ని నమ్మితే ఏముందిరా... కుక్కల్ని, నక్కల్ని నమ్మితే మోక్షముందిరా.." అని సోలోలో పాడుకుంటోందట.

★ ★ ★

ఆబిడ్స్‌లో, ఓ మాజీ రాజమార్గానికి వెళ్లేదారిలో -

ఎత్తయిన బిల్డింగులు. అప్పుడెప్పుడో అలనాటి రాచరికపు రమణీమణుల అందాల అరవిందాలు గుబాళించిన పరిమళాలు, ఆ రోడ్డంట వెళ్ళే పాతకాలం పెద్దల హృదయ కవాటాలకు ఇప్పటికీ జాలిగా తగులుతుంటాయి.

ఉత్తి వెదురులోంచి వినిపించిన ఊపిరిగీతాల్లా విన్పించే నాటి విరహ గీతాస్వరాలు... ఆ జవరాళ్ళ పాల సొగసుల ప్రాంగణంనిండా, పావురాళ్ళ గులకరాళ్ళ గులకశబ్ద సజలపాతాలు.

ఆ ప్రాసాదాల వెనక చరిత్రను, ముందు రేపటి నాగరికతను అంటించుకున్న ఆ గోడల మీద వరస వరసగా అచ్చ తెలుగు శృంగార భంగిమలు. ఇంగ్లీషు వాత్సాయన భంగిమలు. హిందీ కవి చౌడప్పల భంగిమలు, మళయాళపు ముద్దు పళనిల వెన్నెల భంగిమలు.

అక్కడకు ఏన్టీ సెక్స్ టీములొచ్చి ఆగాయి.

ఆ గోడల మీద బూతు బొమ్మల్ని చూసి ఇన్స్పెక్టర్ గుండెలు గుబగుబలాడి పోయాయి. 'ఇంతవిచ్చలవిడిగా ఏమిటీ సెక్స్' నాజాతి ఏమైపోతోంది... నాదేశం ఏమైపోతోంది... అయ్యోభగవాన్...' అని అనుకోబోయి, అందులో

ఏదో అపశబ్ద ముందని తలచి...! 'అయ్యో దేవుడా! రక్షించు నా ప్రజల్ని ఆడ'వాళ్ల' పోస్టర్ల నుంచి .. భక్తిసినిమాల్లో కన్పించే సెక్సప్పీల్ ఆడదేవతల్నుంచి ... లక్షల రెమ్యునరేషన్‌కు కనుగవనీ, చనుగవనీ, కటిపటినీ తాకట్టు పెట్టే సినిమా నటీ శిరోమణుల నుండి హుసేన్‌సాగర్లో మునిగి తేలిన హే బుద్ధ భగవాన్ రక్షించు... పాహి...పాహి..." అని అనుకున్న వాడై –

"ఎక్కడా అశ్లీలం కన్పించకుండా చెయ్యండి చెయ్యండి..." అని జవాన్లను చూసి అరిచాడు ఉర్దూలో.

అదేదో డిటర్జంట్ సోప్ ప్రకటనలోలా తెలుపు రాక్షసుడికి దూరంగా పారిపోతున్న మురికి క్రీముల్లా తెల్లటి వెల్లకి వాలుపోస్టర్లమీద అశ్లీలత, అస్త్రీలతగా మారిపోతోంది.

అక్కడ ఓ మూడు గంటల సేపు పోలీసు జవాన్లు, కార్పొరేషన్ సిబ్బందీ కష్టపడి బూతుబొమ్మల్లో బూతుని తీసేయడానికి తీవ్రంగా కృషిచేశారు.

ఇప్పుడా గోడమీద బొమ్మల్ని ఎవరు ఏ కోణాన్నుంచి చూసినా ఉద్రేకం చెందరు. యౌవనమంతా మాసిపోయిన వృద్ధనారుల్లా గోడల మీద పోస్టర్లు నిస్తేజంగా దర్శనమిస్తున్నాయి.

అప్పటికి ఆ ప్రోగ్రామ్ పూర్తయింది.

పోలీసు అధికారులు సంతృప్తి చెందారు. జవాన్లూ, కార్పొరేషన్ సిబ్బందీ ఎంతో ఆనందించారు.

ఆ రోడ్డుకి ఎడమవైపునున్న ఇరానీ రెస్టారెంటు నుంచి సదరు సిబ్బందికి ఫ్రీగా టీ లొచ్చాయి.

తాగి, హాయిగా ఊపిరి పీల్చుకుని, ఎవరి బ్రాండు సిగరెట్టు వాళ్ళు కాల్చుకున్నాక "ఓ.కె... బస్...యిక జీపులెక్కండి" అంటూ ఇన్‌స్పెక్టర్లు ఆజ్ఞాపించిన మీదట సిబ్బంది జీపులెక్కారు. జీపులన్నీ స్టార్టయ్యాయి.

విశాలమైన ఆ గోడ చివర –

మురికి డబ్బా పక్కన, అంతవరకూ చిరిగిపోయిన పాత గోనెముక్కని కప్పుకుని పడుకున్న ఓ మానవాకారం పక్కకు ఒత్తిగిలి, ఆవలించి, ఒక్కసారి పైకిలేచి నిలబడింది.

ఆ ఆడ ఆకారానికి పాతికేళ్ళ వయసుంటుంది.

కలలు కాలిపోయిన లేతతనం, ఎప్పుడో చచ్చిపోయిన ఆడతనం నగ్నంగా, దిగంబరంగా, అమాయకంగా...

నించున్న పాతికేళ్ళ వయసు, ఆ వెనకున్న గోడలమీద వాల్‌పోస్టర్లలోంచి జారిపోయిన దిష్టిబొమ్మలా ఉంది!

మొట్టమొదట -

జీపులోని ఓ కానిస్టేబుల్ ఆ పాతికేళ్ళ వయసు వేపు చూసాడు. అచ్ఛాదన లేని నగ్న శరీరంవేపు, తోలుతిత్తులైపోయి వేలాడుతున్న గుండెలవేపు చూసాడు. కామంలేని కళ్ళవేపు, కట్టెల్లాంటి కాళ్ళవేపు చూసాడు.

కానిస్టేబుల్ చూపులేకాదు పోలీసు అధికారులు, మిగతా సిబ్బంది చూపులూ ఆ నగ్న వయసు నలుమూలల్నీ ఆకలిగా చూస్తున్నాయి. ఆముష్టి పేదపిల్ల వంటినిండా కామపు కనుల గొంగళి పురుగులు పాకుతున్నాయి.

జవాను చేయి అనుకోకుండా పక్కనున్న సున్నపు డబ్బాలో ఉన్న చీపురువేపు వెళ్ళింది.

ఆ చీపురు ఏ అశ్లీలతను కన్పించకుండా చేస్తుందో ఏ మాలిన్యాన్ని తుడిచేస్తుందో ఏమోమరి!

*ఉదయం వీక్లీ - 6-10-1986*

*